# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, వ్యవస్థాపకత అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహిస్తున్నారు.**

2. **ప్రముఖ కర్ణాటక సంగీత వాగ్గేయకారులు త్యాగరాజ 259వ జయంతి సందర్భంగా ఉపముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ నివాళులర్పించారు.**

3. **పరిశ్రమల ప్రతినిధులతో చర్చిస్తూ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

4. **వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వ ప్రయోజనాలు సమర్థవంతంగా చేరేలా చేయడమే బీసీ కమిషన్ లక్ష్యమని చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా తెలిపారు.**

5. **తిరుపతి జిల్లాలో ఈ రోజు జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతి చెందారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పలు అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, వస్తు ఉత్పత్తి, వ్యవస్థాపకత అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో చర్చించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన పథకం కింద పారిశ్రామిక పార్కుల అభివృద్ధిపైన చర్చించారు. అలాగే 2026-27లో ఏర్పాటు కానున్న రేర్ ఎర్త్ మినరల్ పార్కు, తూర్పు కోస్తా పారిశ్రామిక కారిడార్‌ల అభివృద్ధిపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. అనంతరం రియల్ టైం గవర్నెన్స్- ఆర్టీజీపై సమీక్ష నిర్వహించనున్నారని అధికారులు తెలిపారు.

--------------------------

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం ఎకువూరు గ్రామంలో శాసనసభ్యులు బెందాళం అశోక్‌తో కలిసి రచ్చబండ కార్యక్రమం నిన్న నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొని గ్రామంలోనే రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో సమావేశమై జీవనోపాధి, వసతులు, మౌలిక సదుపాయాలపై

వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెంటనే పరిష్కరించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు.

---------------------------

ప్రముఖ కర్ణాటక సంగీత వాగ్గేయకారులు త్యాగరాజ 259వ జయంతి సందర్భంగా ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ నివాళులర్పించారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈరోజు ఆయన స్పందిస్తూ, దేశ సాంస్కృతిక వైభవాన్ని సుసంపన్నం చేసి గొప్ప సంగీత స్వరకర్త త్యాగయ్య అని పేర్కొన్నారు. త్యాగరాజు పూర్వీకుల జన్మస్థలమైన ఆంధ్రప్రదేశ్‌లో ఆయన వారసత్వాన్ని అంతే భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం మన సాంస్కృతిక బాధ్యతని వెల్లడించారు. సాంస్కృతిక శాఖ సమన్వయంతో త్యాగరాజ రచనలకు సంబంధించిన రాతప్రతులు, స్వరలిపి, అరుదైన రికార్డింగ్‌లు వంటి వాటిని డిజిటలైజ్ చేస్తామని పవన్ కల్యాణ్ తెలిపారు.

---------------------------

నెల్లూరు నగరంలోని దస్తగిరి సాహెబ్ కాలనీలో సి.సి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రతి కాలనీకి మెరుగైన మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వంటి ప్రాథమిక సదుపాయాల అభివృద్ధితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. పరిశ్రమల ప్రతినిధులతో చర్చిస్తూ రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్. 30 సెకన్లు

---------------------------

ఒమన్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్న అన్నమయ్య జిల్లా వయలపాడు గ్రామానికి చెందిన షహ్నాజ్‌ను స్వదేశానికి తీసుకురావడంలో రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. గతేడాది నవంబర్‌లో ఉద్యోగం కోసం మస్కట్ వెళ్లిన షహ్నాజ్‌కు అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో తిరిగి రావాలని నిర్ణయించుకుంది. అయితే అక్కడి ఏజెంట్లు నిరాకరించడంతో షహ్నాజ్ ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయంపై ఆమె భర్త అబూబకర్ ఆంధ్రప్రదేశ్ ప్రవాస తెలుగు సంఘం – ఏపీఎన్ఆర్టీ సొసైటీకి ఫిర్యాదు చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి షహ్నాజ్‌ను స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంది. దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందిస్తూ, వలస కార్మికుల భద్రత, సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ అంశంలో చొరవ తీసుకున్న ఏపీఎన్ఆర్టీ సొసైటీని ముఖ్యమంత్రి అభినందించారు.

---------------------------

గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మ్యాజిక్ డ్రెయిన్లు" ఒక వినూత్న కార్యక్రమమని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కొనియాడారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆమె ఒక వీడియో సందేశంలో మాట్లాడారు. మురుగు కాలువల సమస్య పరిష్కారానికి మ్యాజిక్ డ్రెయిన్లు అనే వినూత్న కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ మ్యాజిక్ డ్రైనేజీ వ్యవస్థ కారణంగా నీరు వడపోతకు గురై భూగర్భ జలాలు మెరుగుపడతాయని సింధు తెలియజేస్తూ...

వాయిస్..30.. సెకన్లు

-----------------------------

వెనుకబడిన వర్గాల వారికి ప్రభుత్వ ప్రయోజనాలు సమర్థవంతంగా చేరేలా చేయడమే బీసీ కమిషన్ లక్ష్యమని బీసీ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై సమగ్ర అధ్యయనం కోసం ప్రభుత్వం నియమించిన బీసీ కమిషన్ తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఈరోజు బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ, బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతుల ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేస్తామని తెలిపారు. జనాభా నిష్పత్తి, ప్రాంతాల వారీ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్లు నిర్ణయిస్తామని తెలిపారు. స్వీకరించిన వినతులను సమగ్రంగా పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు.

-----------------------------

దేశంలో ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్యలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ ఎన్నికల ఫలితాలపై ఆయన ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు తెలిపారని అన్నారు. మరోవైపు.. ఈ ఫలితాలపై విజయవాడలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖా మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ ఈరోజు మాట్లాడుతూ,

వాయిస్ ..30.. సెకన్లు

-----------------------------

తిరుపతి జిల్లాలో ఈ రోజు జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఉరందూరు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని అంబులెన్స్ ఢీకొట్టడంతో ఈ ఘటన చోటు చేసుకుందని డిఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయని చెప్పారు. మృతుల్లో ముగ్గురు పురుషులు, ఒక మహిళ ఉన్నారని తెలిపారు. గాయపడిన ఇద్దరిని తిరుపతి రుయా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు డిఎస్పీ తెలిపారు.

-----------------------------

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం కౌకుంట్ల గ్రామంలో ఈరోజు నిర్వహించిన “ప్రజా దర్బార్” కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.

=====================